సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 28 | ఫిబ్రవరి | 2024



ఆశల పల్లకిలో..
ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దీంతో సంబంధిత శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. - 8లో▸



నైపుణ్యాలు పెంచుకోవాలి
ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు పెంచుకోవాలని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ విద్యార్థులకు సూచించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.7°/18.4°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్ : పొదుపు చేయడం ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా మంగళవారం 2కే రన్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులలో పలు పొదుపు లగురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మూర్తి, బ్యాంక్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిపోయిన అవిశ్వాసం



నెల్లికుదురు: జిల్లాలోని నెల్లికుదురు పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ కాసం లక్ష్మీచంద్రశేఖరరెడ్డి, గుగులోతు లాన్‌సింగ్‌పై ఈ నెల 8వ తేదీన 9మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి డీసీఓ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. కాగా సొసైటీ కార్యాలయంలో మంగళవారం అవిశ్వాస తీర్మానానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11గంటల వరకు13మంది డైరెక్టర్లలో ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీఓ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీ సీఈఓ రమాదేవి అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కలలను విద్యార్థులు సాకారం చేయాలన్నారు. ఉత్తమ మార్కులు సాధించి వారికి బహుమతిగా అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దాతలు జైపాల్‌రెడ్డి, బాలు విద్యార్థులకు సాయంకాలం అల్పాహారం, తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్నబియ్యం దందాపై నిఘా వర్గాల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని పౌరసరఫరాల శాఖ ద్వారా పేదలకు అందించే బియ్యం పక్కదారి పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆశాఖ ఉద్యోగులు, అధికారుల తీరుపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'సన్నబియ్యం దందా..' కథనంపై జిల్లా నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లయిస్‌లో జరుగుతున్న అవినీతి.. దానిలో ఎవరి పాత్ర ఉంది.. అక్రమార్కులకు మద్దతు ఇస్తున్నది ఎవరు.. అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు, వారి సంపాదించిన ఆస్తులు, ఇతర వ్యాపారాల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. వారి నివేదిక ఆధారంగా సదరు ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.

నిట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆన్‌లైన్‌లో మంగళవారం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించి మాట్లాడారు. క్లౌడ్ అండ్ ఫాగ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్స్ ఫర్ ఐటీ అనే అంశంపై అధ్యాపకులు బోధనలో మెళకువలు నేర్చుకోవాలని తెలిపారు. నిట్ ప్రొఫెసర్లు శ్రీహరిరావు, పద్మావతి, శ్రీనివాస్ నాయక్, చంద్రశేఖర్, ఆయా విద్యా సంస్థల అధ్యాపకులు ఉన్నారు.

వసూళ్లు అంతంతే..

- 461 జీపీల్లో 67.59శాతం పన్నుల సేకరణ
- నాలుగు మున్సిపాలిటీల్లోనూ ఇదే తీరు
- డోర్నకల్ మండలంలో 100శాతం పూర్తి
- నెలరోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



మహబూబాబాద్: జిల్లాలో ఆశించినస్థాయిలో పన్నులు వసూళ్లు కావడం లేదు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నామమాత్రంగానే ఇంటి, నల్లా పన్నులు వసూళ్లు అయినట్లు అధికారులు చెబుతున్నారు. డోర్నకల్ మండలంలో మాత్రం వందశాతం వసూళ్లు చేసినట్లు వెల్లడించారు. మరో నెలరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఈలోపు వందశాతం పన్నులు వసూళ్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కలెక్టర్ దృష్టిసారిస్తేనే వసూళ్లలో వేగం పెరిగే అవకాశం ఉంది.

జీపీల్లో 67.59శాతం

జిల్లాలో 18 మండలాలు, 461 గ్రామపంచాయతీలు, 4 మున్సిపాలిటీలు ఉన్నాయి. 461జీపీల్లో 2,09,481 గృహాలు, 6,54,404 మంది జనాభా ఉంది. 2022–23 అర్థిక సంవత్సరంలో ప్రభుత్వ భవనాల పన్ను బకాయిలు మినహా 92 శాతం వసూళ్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జీపీలో 67.59శాతం మాత్రమే పన్నులు వసూళ్లు చేశారు. అయితే డోర్నకల్ మండలంలో 100 శాతం, గంగారం మండలంలో 99.99శాతం వసూళ్లు చేయగా.. అతి తక్కువగా పెద్దవంగరలో 39.24 శాతం మాత్రమే వసూళ్లు చేశారు.

మున్సిపాలిటీల్లో..

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. కాగా మానుకోట మున్సిపాలిటీలో 2022–23లో ఇంటి పన్నుల డిమాండ్ రూ. 4.12కోట్లు ఉండగా.. రూ 3.58కోట్లు వసూళ్లు చేశారు. అలాగే 7,000 నల్లా కనెక్షన్లు ఉండగా.. రూ.71,67,000 వసూళ్లతో 87.01శాతం నమోదైంది. కాగా 2023–24ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నుల డిమాండ్ రూ.4.52 కోట్లు ఉండగా నేటి వరకు రూ.2.39కోట్లు వసూళ్లు చేశారు. అలాగే నల్లా పన్నుల డిమాండ్ రూ.2.39 కోట్లు కాగా నేటి వరకు రూ.40లక్షలు మాత్రమే వసూళ్లు చేశారు. మిగిలిన తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో కూడా నామమాత్రంగానే వసూళ్లు చేశారు.

వందశాతం సాధ్యమేనా..

ప్రభుత్వం వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలని ఆదేశించినా అధికారుల నిర్లక్ష్యం వల్ల జిల్లా వెనుకబడింది. కాగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ దృష్టిసారిస్తేనే వసూళ్లలో వేగం పెరిగే అవకాశం ఉంది. లేకుంటే అంతే సంగతులు. కాగా ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

సమీక్షలు నిర్వహించాం..

పన్నుల వసూళ్లపై పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించాం. వంద శాతం పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాం. ఆ దిశగా చర్యలు చేపట్టాం. పదిహేను రోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నాం.

–హరిప్రసాద్, డీపీఓ

రెడ్ నోటీస్‌లు ఇస్తున్నాం..




వంద శాతం పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రజలు కూడా అన్ని విధాలా సహకరించి బిల్లులు చెల్లించాలి. ఇప్పటి వరకు మున్సిపాలిటీలో 52శాతం పూర్తి చేశాం. చెల్లించనివారికి రెడ్ నోటీస్‌లు ఇస్తున్నాం.

–సోముల రవీందర్, మానుకోట మున్సిపల్ కమిషనర్

కమలంలో కయ్యం!

- బీజేపీ జిల్లా నూతన కమిటీ వేసిన తర్వాత పాత నాయకులు దూరం
- ఒకరిపై ఒకరు రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు
- నిరాశలో పార్టీ కార్యకర్తలు
- విజయ సంకల్పయాత్ర ఉత్సాహం నింపుతుందని ఆశలు



సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల వరకు జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు దీటుగా బీజేపీ ఫైట్ చేసింది. ఎక్కడా తగ్గకుండా ముందుకు సాగింది. అయితే ఆశించిన ఫలితాలు రాకపోవడంతో శ్రేణులు, నాయకుల్లో నైరాశ్యం నెలకొంది. అప్పటి వరకు ఉన్న ఉత్సాహం.. అనంతరం లేకుండాపోయింది. ఈక్రమంలో పలు మార్పులు జరగడంతో కొందరు జిల్లా ముఖ్య నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని ప్రచారం.

పాత కమిటీ దూరం

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ క్షేత్రస్థాయిలో నూతన కమిటీలను వేసింది. దీనిలో భాగంగా జిల్లా కమిటీని కూడా మార్చారు. జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు స్థానంలో యలమంచిలి వెంకటేశ్వరరావును నియమించారు. ఆయన నియామకాన్ని కొందరు పార్టీ నాయకులు సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పనిచేస్తున్న నాయకులతో సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరిగింది. అలాగే మండల కమిటీల ఏర్పాటులో కూడా సీనియర్ నాయకులను సమన్వయం చేసుకోలేదని ఫిర్యాదులు వచ్చాయి. ఈక్రమంలో పార్టీ కార్యక్రమాలకు పాత కమిటీ, క్యాడర్ దూరంగా ఉంటుందని తెలిసింది.

రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు..

బీజేపీ జిల్లా నాయకుల్లో వర్గపోరు నెలకొనడంతో.. రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు కొత్త అధ్యక్షుడి నియామకంపై మరోసారి ఆలోచించాలని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఫిర్యాదులు కూడా అందినట్లు ప్రచారం. ఇందులో జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, రాష్ట్ర నాయకులు మూకుమ్మడిగా సంతకాలు చేసి ఫిర్యాదు అందించినట్లు ప్రచారం. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో పనిచేసిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయకుండా.. సొంత వ్యవహారాలను చక్కదిద్దుకున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్త కమిటీ వేయడం సబబే అని మరికొందరు రాష్ట్ర నాయకులకు చెప్పినట్లు తెలిసింది.

విజయ సంకల్ప యాత్ర కలిసేనా..

పార్లమెంట్ ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా విజయసంకల్ప యాత్రలను ప్రారంభించింది. దీనిలో భాగంగా భద్రాద్రి నుంచి భద్రకాళీ వరకు యాత్ర ప్రారంభమైంది. ఇందులో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం, పినపాక, ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగుతోంది. కాగా ఈ యాత్రతోనైనా అందరూ కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేస్తారని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు.

సిబ్బంది డుమ్మా.. ఎమ్మార్సీ ఆఫీస్‌కు తాళం

- డీఈఓ తనిఖీలో వెల్లడి



ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

తొర్రూరు: ఉదయాన్నే విధులకు హాజరు కావాల్సిన సిబ్బంది డుమ్మా కొట్టారు. దీంతో ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం దర్శనమిచ్చింది. ఈ ఘటన మంగళవారం తొర్రూరులోని ఎమ్మార్సీ కార్యాలయంలో డీఈఓ చేపట్టిన తనిఖీలో వెల్లడైంది. ఉదయం 11.50 గంటలకు డీఈఓ రామారావు స్థానిక విద్యా వనరుల కేంద్రానికి రాగా తాళం వేసి ఉంది. ఆ సమయంలో కార్యాలయంలో పని చేసే సిబ్బంది డుమ్మా కొట్టారు. కంప్యూటర్ ఆపరేటర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సెలవులో ఉండగా, మరో ముగ్గురు సిబ్బంది విధులకు ఎగనామం పెట్టినట్లు డీఈఓ తనిఖీలో వెల్లడైంది. ఈ ఘటనపై ఆగ్రహించిన ఆయన సిబ్బంది డుమ్మా వ్యవహారంపై లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు. కాగా ఈ విషయంపై ఎంఈఓ గుగులోతు రామును వివరణ కోరగా...డీఈఓ తనిఖీ వేళ సిబ్బంది ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ పరీక్ష పత్రాల పంపిణీకి స్థానిక ఉన్నత పాఠశాలకు వెళ్లారని, అందుకే కార్యాలయానికి తాళం వేసి కనిపించిందని తెలిపారు.

బదిలీలు, పోస్టింగ్‌లపై ఈసీఐ సీరియస్!

- పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్... మూడేళ్లు దాటితే స్థానచలనం
- పోలీసుశాఖలో ఇన్‌స్పెక్టర్ ఆపైస్థాయి అధికారులకు వర్తింపు
- రెవెన్యూ, పోలీసుశాఖల్లో మరోసారి తప్పని భారీ బదిలీలు
- ఈసీ మార్గదర్శకాలపై ఉన్నతాధికారుల కసరత్తు..



సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సీరియస్‌గా వ్యవహరిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా బదిలీలు చేయాలని పదే పదే జిల్లా ఉన్నతాధికారులకు సూచిస్తోంది. నెల రోజుల కిందట దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేసిన, స్థానిక అధికారుల బదిలీల ప్రక్రియ వెంటనే ముగించాలని సీఈసీ ఆదేశించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో వివిధ కేడర్‌లకు చెందిన సుమారు 63 మంది పోలీసు అధికారుల బదిలీ జరిగింది. రెవెన్యూ, ఇతర శాఖల్లో 81 మంది అటు ఇటుగా మారారు. ఇంకా బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియ కొనసాగుతుండగా... 2023 డిసెంబర్ 21, 2024 ఫిబ్రవరి 23న జారీ అయిన జీఓలకు అనుబంధంగా కేంద్ర ఎన్నికల సంఘం 437/ 6/ 1/ ఐఎన్ఎస్‌టీ/ ఈఎస్ఐ/ ఎఫ్‌యూఎన్‌సీటీ/ ఎంసీసీ/ 2023 ద్వారా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటికే పొలిటికల్ పోస్టింగ్‌లకు వెసులుబాటు ఉండే విధంగా సవరణలు జరుగుతుండగా.. తాజా ఉత్తర్వులతో మరోసారి బదిలీల కుదుపు తప్పదన్న చర్చ సాగుతోంది.

పోలీసు, రెవెన్యూశాఖల్లో మరోసారి బదిలీల కుదుపు..

ఈసీ సూచనల మేరకు ఈ నెల 7నుంచి పోలీస్‌శాఖలో పెద్ద ఎత్తున బదిలీల ప్రక్రియ సాగింది. ఆ తర్వాత కొన్ని మార్పులు చేర్పులు కలిపి మరో ఏడుగురు బదిలీ అయ్యారు. ఇదే సమయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓలు, సీఈఓలు, అబ్కారీ, అటవీశాఖల్లోనూ బదిలీల పరంపర కొనసాగింది. అడిషనల్ కలెక్టర్లు, డీఆర్‌ఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. ఉమ్మడి వరంగల్‌లో సుమారు 63మంది వివిధ కేడర్‌ల పోలీసు అధికారుల బదిలీ జరిగింది. రెవెన్యూ, ఇతర శాఖల్లో 81మంది అటు ఇటుగా మారారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఈ నెల 7న 29మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలగగా, 9న తొమ్మిది మంది బదిలీలు జరిగాయి. నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సోమవారం కూడా ఉత్తర్వుల వెలువడ్డాయి. జోగులాంబ గద్వాల అదనపు ఎస్పీగా ఉన్న రవిని కమిషనరేట్ అదనపు డీసీపీగా నియమించగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఈసీఐ తాజా ఆదేశాల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పోలీసు, రెవెన్యూ శాఖల్లో మరోసారి బదిలీల కుదుపు తప్పదంటున్నారు. ఈ మేరకు వారంలోగా భారత ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించేందుకు బదిలీలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మహబూబాబాద్: జిల్లాలో తాగునీటి కొరత లేకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పంచాయతీ, మున్సిపల్, నీటిపారుదల ఇంజనీరింగ్, మిషన్ భగీరథ అధికారులతో వేసవిలో తాగునీటి సరఫరాపై అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. జిల్లాలోని బోర్ల పనితీరుపై తక్షణమే నివేదికలు అందజేయాలన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. గతంలో గ్రామాల్లో వినియోగించిన నీటి వనరులను పునరుద్ధరించాలని సూచించారు. నీటి పారుదలశాఖ అధికారులు సేద్యం కంటే తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు సాగునీరు వృథాకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ రమాదేవి, సీపీఓ సుబ్బారావు, ఇరిగేషన్ ఈఈ సమ్మిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం



మహబూబాబాద్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే విజయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25న భద్రాచలంలో ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభమైందన్నారు. 28న డోర్నకల్ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. నెల్లికుదురులో కార్నర్ సమావేశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలో బైక్‌యాత్రతోపాటు, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. తర్వాత కేసముద్రం నుంచి గూడూరులో యాత్ర ముగుస్తుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

డీఎఫ్‌ఓగా విశాల్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా అటవీశాఖ అధికారిగా విశాల్ బత్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. 2020 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి విశాల్ బత్తుల ఆమ్రాబాద్ అటవీశాఖ డివిజనల్ అధికారిగా పనిచేసి డీఎఫ్ఓగా బదిలీపై వస్తున్నారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న డీఎఫ్ఓ టి.రవికిరణ్‌ను మీ సేవ కమిషనర్‌గా బదిలీ చేశారు.

నేడు తిరుగువారం పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం, కన్నెపల్లిలో నేడు (బుధవారం) సమ్మక్క, సారలమ్మ పూజారులు అమ్మవార్లకు తిరుగువారం పండుగ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మేడారంలోని సమ్మక్క గుడిని సమ్మక్క పూజారులు శుద్ధి చేసి ముగ్గులతో అలంకరించి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కూడా సారలమ్మ పూజారులు తిరుగువారం పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగ సందర్భంగా మేడారం, కన్నెపల్లి గ్రామాల్లోని పూజారులు, ఆదివాసీ కుటుంబాలు, స్థానికులు అమ్మవార్ల గుడికి వచ్చి కోళ్లు, యాటలు నైవేద్యంగా సమర్పించనున్నారు. దేవాదాయ శాఖ అధికారులు తిరుగువారం పండుగ పూజా కార్యక్రమాలకు సంబంధించిన సామగ్రిని పూజారులకు అందజేశారు. తిరుగువారం పండుగతో మహాజాతర పూజా కార్యక్రమాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నేడు జాతర షురూ..

గంగారం : మండలంలోని పూనుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు తిరుగువారం జాతర నేడు ప్రారంభం కానుంది. మేడారంలో భక్తుల పూజలందుకున్న పగిడిద్దరాజు తిరిగి స్వగ్రామానికి చేరుకున్న విషయం తెలిసిందే. కాగా బుధ, గురు, శుక్ర వారాల్లో తిరుగువారం జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. జాతరకు మహబూబాబాద్ జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకోనున్నారు. కాగా భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన పూజారులు తెలిపారు.

జాతరను విజయవంతం చేయాలి



జాతర సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, అధికారులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
- వీరభద్రస్వామి జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

కురవి: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో జారత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈమేరకు పలు శాఖల అధికారులు తమ నివేదికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్చి 8న మహాశివరాత్రి నుంచి వీరభద్రస్వామి జాతర జరుగుతుందని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కాంతులతో జాతర వెల్లివిరియాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో భగీరథ నీళ్లు రావడంలేదని కురవి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఖమ్మం వెళ్లే మార్గంలో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉందని దాన్ని పూడ్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆలయ కమిటీని త్వరగా తీసుకురావాలని సూచించారు. కాగా సీరోలు, కురవి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, ఎంపీడీఓ వీరబాబు, తహసీల్దార్లు సునీల్‌రెడ్డి, శారద, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య, డీఎం శివప్రసాద్, డీఈ విజయ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) వాయిదా వేయాలనే డిమాండ్‌తో ఆయా పరీక్షల టైంటేబుల్‌ను మార్చారు. మార్చి 2వ తేదీ నుంచి పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి మంగళవారం తెలిపారు. పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ అండ్ ఎంఎల్ఐఎస్‌సీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సులలో మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మార్చి 2, 4, 13, 15, 18, 20వ తేదీల్లో ఆయా పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు ఉంటాయని పేర్కొన్నారు. కేయూ పరిధిలో 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,512మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.



పదో తరగతి కీలక ఘట్టం

పెద్దవంగర: విద్యార్థుల జీవితంలో పదో తరగతి అత్యంత కీలక ఘట్టమని డీఈఓ రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భయాన్ని జయించిన వారే పరీక్షలు బాగా రాయగలుగుతారని చెప్పారు. విద్యార్థులకు నిత్యం ప్రత్యేక తరగతులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు.



విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న డీఈఓ రామారావు

కార్యక్రమంలో హెచ్‌ఎం బుదారపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీధర్, యాకన్న, హైమ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు ఏజీపీగా రాధా సందీప్తి రెడ్డి



వరంగల్ లీగల్ : తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కట్ట రాధా సందీప్తిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 ఏజీపీలను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా అందులో సందీప్తి ఒకరు. నగరంలోని సుబేదారి ప్రాంతానికి చెందిన సందీప్తి కాకతీయ యూనివర్సిటీలో న్యాయ శాస్త్రం అభ్యసించారు. న్యాయ శాస్త్రంలో ఆమె గోల్డ్ మెడల్ సాధించారు. హనుమకొండ జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది గంట విద్యాసాగర్‌రెడ్డి వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. కాగా, రాధా సందీప్తి రెడ్డి నియామకంపై హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

జంపన్నవాగు బావిలో యువకుడి గల్లంతు



ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా నూజీవీడు మండలం విస్సన్నపేటకు చెందిన అద్దంకి అంజి (35) మేడారం జాతరకు బుడబుక్కల కూలీ పని కోసం వచ్చాడు. జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావిలో బంతి ఉందని గుర్తించాడు. లోతు అంచనా వేయలేక బావిలో దిగి గల్లంతయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలిని పరి శీలించారు. బావి లోతు 20 ఫీట్ల ఉండడంతో అంజి ఆచూకీ కోసం గజ ఈతగాళ్ల సాయం తీసుకోనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశల పల్లకిలో..

- మార్కెట్ కమిటీల నియామక ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 17 మార్కెట్లకు నూతన కమిటీలు
- ముఖ్య నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు



ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్

వరంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలో విజయం సాధించి కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ పాలక వర్గాలన్నింటిని రద్దు చేసింది. ఆయా మార్కెట్లకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. కాగా, ఈనెల 21వ తేదీన ఆదిలాబాద్ జిల్లా బోథ్ వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామక ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీలకు సంబంధించి చైర్మన్ పదవులు దక్కించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు తమ గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పాత రిజర్వేషన్లే అమలు..

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీతో పాటు మహిళలకు ఆయా కేటగిరీల్లో మొత్తం ఐదు దఫాలు కమిటీ నియామకాల్లో అమలు చేయాలనే నిబంధనలతో రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో తీసి ఖరారు చేశారు. అందుకే రిజర్వేషన్ల వారీగా కమిటీ నియామకాలు పూర్తి కాకపోవడంతో పాత రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 17 మార్కెట్ కమిటీల్లో ఇప్పటి వరకు భూపాలపల్లి, చిట్యాల మార్కెట్లకు మొదటి దశ, నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట, ములుగు, తొర్రూరు, పాలకుర్తి మార్కెట్లకు రెండో దశ, వరంగల్, ఆత్మకూరు, కాటారం, మహబూబాబాద్, కేసముద్రం, జనగామ, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీలకు మూడో దశ, పరకాల, కొడకండ్ల మార్కెట్ కమిటీలకు నాలుగో దశ రిజర్వేషన్ల ప్రకారం కమిటీల నియామకాలు పూర్తయ్యాయి. ఈ మార్కెట్ కమిటీలకు ప్రస్తుత రిజర్వేషన్ల అనంతరం వర్తించే రిజర్వేషన్ల ప్రకారం నూతన కమిటీల నియామకాలు జరుగుతాయని మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలిపారు.

అమలు కానున్న రిజర్వేషన్లు..

ఉమ్మడి జిల్లాలో మార్కెట్ల రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లాలోని వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ(ఎస్సీ మహిళ), నర్సంపేట(బీసీ జనరల్), నెక్కొండ(ఎస్సీ జనరల్), వర్ధన్నపేట(ఎస్సీ జనరల్), హనుమకొండ జిల్లాలోని పరకాల(ఓసీ జనరల్), ఆత్మకూరు(ఓసీ మహిళ), ములుగు జిల్లాలోని ములుగు(ఎస్టీ), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం(ఎస్సీ మహిళ), భూపాలపల్లి(బీసీ జనరల్), చిట్యాల(ఓసీ మహిళ), మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్(ఎస్టీ జనరల్), కేసముద్రం(ఓసీ జనరల్), తొర్రూరు(ఓసీ జనరల్), జనగామ జిల్లాలోని జనగామ(బీసీ జనరల్), ఘనపూర్‌స్టేషన్(ఓసీ జనరల్), కొడకండ్ల(ఎస్సీ మహిళ), పాలకుర్తి(ఎస్టీ మహిళ) వర్గాలకు చెందిన వారికి చైర్మన్ పదవులు దక్కనున్నాయి. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జనరల్ కేటగిరీ రిజర్వేషన్లలో మహిళలు లేదా పురుషులకు అవకాశం లభించనుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు



ఉద్యోగులకు స్వీట్ పంచుతున్న భానుకిరణ్

హన్మకొండ: మేడారం సమక్క, సారలమ్మ మహా జాతరలో నిబద్ధతతో పనిచేసి విజయవంతం చేసిన ఆర్టీసీ ఉద్యోగులను వరంగల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్ అభినందించారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో మేడారం జాతర విజయవంతం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులకు మిఠాయిలు పంపిణీ చేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి, సిబ్బంది విజయవంతంగా అమలు చేశారన్నారు. స్నేహభావంతో విధులు నిర్వహించారని కొనియాడారు. డీఎం వి.మోహన్‌రావు మాట్లాడుతూ.. మేడారం జాతరను విజయవంతం చేయడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు కీలక పాత్ర పోషించారన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) చిమ్మని సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

దేశవాళీ గోవులను సంరక్షించుకోవాలి

- పశుగణాభివృద్ధి సంస్థ వరంగల్ కార్యనిర్వహణాధికారి రఘు బాబు



మాట్లాడుతున్న రఘు బాబు

హన్మకొండ: దేశవాళీ గోవులను సంరక్షించుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వహణాధికారి రఘుబాబు అన్నారు. మంగళవారం వరంగల్‌లోని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో చింతగట్టులోని మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోసంరక్షణపై వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాకు చెందిన గోపాల మిత్ర కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రఘుబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గో సంరక్షణ.. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలతో ముడిపడి ఉందన్నారు. గోవుల వల్ల దేశ ఆర్థిక స్థితితోపాటు వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. సకల జీవ రాశి ఆరోగ్యాన్ని కాపాడే దేశవాళీ గోవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ సంస్కృతిలో దేశవాళీ గోవులకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఈ క్రమంలో గోపాలమిత్ర కార్యకర్తలు దేశవాళీ గోవుల సంతతి పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహర్షి గోశాల ట్రస్టు కార్యదర్శి దుగ్యాల కిషన్ రావు, సభ్యుడు తేరాల యుగంధర్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం కందికొండ క్రాస్ రోడ్డు వద్ద 6 కిలోల ఎండు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఆ సమయంలో సీరోలు ఎస్సైగా ఉన్న చంద్రమోహన్ కేసు నమోదు చేసి గంజాయి రవాణా ఘటనలో కొత్తూరు (సీ) పరిధి గుజిలీతండాకు చెందిన ధారావత్ భద్రు, నర్సింహులపేట మండలం పెద్దనాగారానికి చెందిన చిత్తనూరి నరేష్‌పై కేసు నమోదు చేశారు. సదరు కేసు ఐఓలుగా వ్యవహరించిన అప్పటి ఎస్సైలు లావుడ్య నరేష్, బానోత్ రాణాప్రతాప్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించగా కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై వెంకటాచారి, ప్రస్తుత సీరోలు ఎస్సై విజయరాంకుమార్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారులు హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాము, రాజు, తాజీం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి.. నేరం నిరూపణకావడంతో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ. 2లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నేరస్తులకు శిక్ష పడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc., NURSING ADMISSIONS

■ **B.Sc Nursing (Boys & Girls)** Admissions available 2023-2024, at Medha Institute of Nursing & Diagnostic Sciences, Near Relief Hospital, Paidipally, Warangal. NO EAMCET, NO NEET Only 10+2, Contact (or) Whatsapp: 8801456289, 7675882992. [WA-0355]

REAL ESTATE

LAND FOR SALE

■ 15వ డివిజన్, మొగిలిచెర్ల గ్రామ శివారులో 0.35 గుంటల భూమి అమ్మకమునకు కలదు. రోడ్డు సౌకర్యం కలదు. సంప్ర॥ 9618442828. [WA-13918]

షట్టర్ కిరాయికి ఇవ్వబడును

■ పిన్నింటి కాంప్లెక్స్ పర్వతగిరి వరంగల్ వాణిజ్య బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలకు షట్టర్స్ కిరాయికు కనీస వసతులు, విశాలమైన కారు పార్కింగ్ కలదు. సంప్ర॥ 9441928908. [W-1200981]

SERVICES

CHANGE OF NAME

■ **I, VOLAM JAYALAXMI, W/o. RAVINDER,** D/o. Veereshalingam, D/o. Suvarnam (Old Name), Occ: Household, R/o. Flat No. 317, 2nd Floor, GMR Gokulam Apartment, Shambunipet, Warangal Dist - 506005, T.S. India, have changed My Name to VOLAM JAYALAXMI, W/o. Volam Ravinder, D/o. Veereshalingam Katkuri, D/o. Suvarnam Katkuri (New Name). [W-1220992]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ **I, VOLAM JAYALAXMI, W/o.** RAVINDER, Age: 47, (Old Name), Occ: Household, R/o. Flat No. 317, 2nd Floor, GMR Gokulam Apartment, Shambunipet, Warangal Dist - 506005, T.S. India, have changed My Name to VOLAM JAYALAXMI, W/o. Volam Ravinder, (New Name) [W-1220991]

FINANCE SERVICES

■ సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్ట్‌గేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్: 9666142226. [W-788999]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

WANTED

■ శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్‌లో పనిచేయుటకు సోలార్ టెక్నీషియన్స్–5, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్–5, అకౌంటెంట్–1, గ్రాఫిక్ డిజైనర్–1, రిసెప్షనిస్ట్–1, టెలికాలర్స్–3 కావలెను. సంప్ర॥ చింతల నరసింహులు కాంప్లెక్స్ పైన, లష్కర్‌బజార్, HNK. Cell: 9515954923, 8885003401. [W-1200867]

■ **Wanted Technitions 10th, ITI (P/F) at Rampur Industrial Area Kazipet (8K to 10K). Contact: 7981016232.** [WA-7295]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000–16000. సంప్ర॥ 9000463426. [W-1220896]

■ **Wanted PRO's for Degree and Junior College Admissions (20 years Experience) Cont. 8121554649, 9391660036** [WA-13916]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9502712418, 9030612463 [M-1233799]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233860]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం?




నాగేంద్ర(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు గర్రెపల్లి నాగేంద్ర(45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం..సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన నాగేంద్ర కొన్ని సంవత్సరాల నుంచి మహాముత్తారం మండలం ములుగుపల్లిలోని ట్రైబల్ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నెల రోజుల క్రితం డిప్యుటేషన్‌పై కాళేశ్వరం గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ములుగు జిల్లా గట్టమ్మ వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గమనించి వెంటనే పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మంగళవారం మహదేవపూర్‌లో నాగేంద్ర అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, నాగేంద్ర మృతికి కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. మృతుడికి భార్య మంజుల, కుమారుడు ఉన్నారు.

ఆర్మీ జవాన్ అంటూ మోసానికి యత్నం

- అప్రమత్తంగా వ్యవహరించి తప్పించుకున్న వ్యాపారి



సైబర్ మోసగాడు పంపిన ఫోన్ పే రసీదు

కాశిబుగ్గ: ఆర్మీ జవాన్ అంటూ ఓ దుండగుడు.. వ్యాపారికి ఫోన్ చేసి డబ్బు స్వాహా చేసేందుకు యత్నించాడు. ఈ ఘటనపై వ్యాపారి అప్రమత్తంగా వ్యవహరించగా, సైబర్ నేరగాని యత్నం విఫలమైంది. మంగళవారం మధ్యాహ్నం దుండగుడు కాశిబుగ్గలోని వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్ యాజమాని నాగరాజుకు ఫోన్ చేసి తాను ఆర్మీ సోల్జర్‌నని, తనకు ఈ మెడిసిన్స్ కావాలని మెడిసిన్ చిట్టిని వాట్సాప్‌కు పంపించాడు. మా అబ్బాయి వస్తాడు.. ఈ మెడిసిన్ అతడికి ఇవ్వాలని చెప్పాడు. రూ.2,121 బిల్లు అయ్యిందని నాగరాజు చెప్పగా.. ఫోన్‌పేతో చెల్లిస్తానని చెప్పాడు. ఫేక్ ఫోన్ పేలో పొరపాటున రూ.7,121 పంపానని, మిగతా రూ.5వేలు తన ఫోన్ పేకు పంపాలని వాట్సాప్‌లో ఫేక్ రసీదు పంపాడు. అయితే సైబర్ మోసాల ఘటనలు తెలిసిన నాగరాజు తన బ్యాంక్ బ్యాలెన్స్‌ను చెక్ చేయగా అందులో డబ్బు జమ కాలేదు. దీంతో సదరు వ్యక్తి మోసం చేయడానికి ప్లాన్ చేశాడని గుర్తించాడు. అనంతరం సదరు మోసగాడు మళ్లీ నాగరాజుకు ఫోన్ చేసి నేను డబ్బులు పంపానని చెప్పి వీడియో కాల్ చేసి చెప్పాడు. అయినా నాగరాజు స్పందించలేదు. బ్యాంక్ బ్యాలెన్స్ చూసుకోవడం వల్ల తాను సైబర్ మోసానికి గురికాలేదని నాగరాజు తెలిపారు. కాగా, ఈ తరహా మోసాలపై వ్యాపారులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నాగరాజు కోరారు.

సైబర్ మోసం.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. బ్యాంకు అకౌంట్ నుంచి క్షణాల్లో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సదరు ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో ఓ లింక్ పంపారు. బ్యాంక్ నుంచి వచ్చిందని భావించిన బాధితుడు.. లింక్‌ను ఓపెన్ చేయడంతో తన అకౌంట్ నుంచి రూ. 18 వేలు క్షణాల్లో డ్రా అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

- కేయూ వీసీ తాటికొండ రమేష్



మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్ : ప్రస్తుత పోటీ ప్రపంచలో నైపుణ్యాలు పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ విద్యార్థులకు సూచించారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని తెలిపారు. మంగళవారం కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయినుంచే అభివృద్ధి జరగాలన్నారు.భారతదేశ ప్రజల సగటు ఆదాయం పెరగాలన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోకే వెళ్లొద్దన్నారు. ప్రజల కొనుగోలుశక్తి పెరగాలన్నారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు ఆచార్య వి అప్పారావు మాట్లాడుతూ 1991 తరువాత భారత దేశంలో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సంజయ్‌బియాని మాట్లాడుతూ ఈసదస్సులో వచ్చే పరిశోధన పత్రాల ద్వారా విధాన నిర్ణయాలు సులభతరం కావాలన్నారు. హైదరాబాద్ ఐసీఎస్ఎస్ఆర్ గౌరవ సంచాలకుడు బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేయూలో సెమినార్ల పరిశోధన పత్రాలను పుస్తకం రూపంలో తీసుకురావాలన్నారు. ఈసదస్సు అధ్యక్షురాలు అమరవేణి మాట్లాడుతూ ఫైనాన్స్ అంటే ఫండ్ రేయిజింగ్ మాత్రమే కాదని, ఒక ఇన్వెస్ట్‌మెంట్‌గా మారాలన్నారు. బి.సుధాకర్‌రెడ్డి, విజయ్‌కిరణ్, డైరెక్టర్ కె.రాజేందర్, నర్సింహాచారి, పి.వరలక్ష్మి, అమరవేణి, ఓంప్రకాశ్, రాజిరెడ్డి, రాజేశం, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

సాహిత్యానికి ఇతర శాస్త్రాలతో సంబంధం ఉండాలి

కేయూ క్యాంపస్: సాహిత్యానికి ఇతర శాస్త్రాలతో సంబంధం ఉండాలని కేయూ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. తెలుగువిభాగం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో 'కేయూ ఆచార్యుల సాహితీసేవ' అనే అంశంపై రెండు రోజులుగా క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం సాయంత్రం ముగిసింది. స్ఫూర్తి ప్రదాతలు కేయూ పూర్వపు ఆచార్యులు అని కొనియాడారు. మొదటితరం అధ్యాపకుల విద్యాసేవల పునాదులపై కాకతీయ యూనివర్సిటీ నిలబడిందన్నారు. 'విమర్శి'ని పరిశోధన పత్రికను ఆవిష్కరించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, సెమినార్ డైరెక్టర్ బన్న ఐలయ్య, ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య మహ్మద్ ఇక్బాల్ అలీ, తెలుగు అకాడమీ పూర్వపు సంచాలకులు ఆచార్య యాదగిరి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయని విద్మహే, డాక్టర్ గంగు ప్రసాద్ పాల్గొన్నారు.

'అడ్జెంట్ ఫ్యాకల్టీ'పై విజిలెన్స్ విచారణ!



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో రిటైర్డ్ ఆచార్యులను(16మంది) అడ్జెంట్ ఫ్యాకల్టీగా యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నియమించారని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్)జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి మంగళవారం తెలిపారు. ఈమేరకు హైదరాబాద్‌లోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు గతంలోనే తాను ఫిర్యాదు చేసినట్లు అందులో భాగంగానే విచారణకు ఉపక్రమించారని ఇస్తారి పేర్కొన్నారు. కేయూలో ప్రస్తుతం ఇద్దరే అడ్జెంట్ ఫ్యాకల్టీగా కొనసాగుతున్నారు. అడ్జెంట్ ఫ్యాకల్టీ నియామకంపై ఇస్తారి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారనేది యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతుల్లో ఒకరు మానుకోట జిల్లావాసి



బోడ రమేష్ (ఫైల్)

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు బోడతండాకు చెందిన బోడ రమేష్(34) గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఖమ్మం నుంచి ఇంటికి బయలుదేరాడు. తిరుమలాయపాలెం సమీపానికి రాగానే ఖమ్మం ఖానాపురం హవేలీ, బుర్హాన్‌పురానికి చెందిన డిగ్రీ విద్యార్థులు షేక్ ముజాకిర్(19) అలియాస్ సోహెల్, మహ్మద్ మహబూబ్‌పాషా, ఐతరాజు సాయితనూష్ తిరుమలాయపాలెంలో ఓ మిత్రుడి ఇంట్లో ఫంక్షన్ నుంచి స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు అతివేగంగా ఢీకొనగా, రమేష్, ముజాకిర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే, మహబూబ్‌పాషా, సాయితనూష్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇన్‌చార్జ్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై గిరిధర్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెద్దదిక్కును కోల్పోయిన రమేష్ కుటుంబం

బోడ రమేష్ ఖమ్మంలో గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ వారానికి ఒక్కసారి ఇంటికి వెళ్లివచ్చేవాడు. ఇందులో భాగంగా సోమవారం ఇంటికి బయలుదేరిన ఆయన గమ్యాన్ని చేరలేదు. రమేష్‌కు భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉండగా ఆయన కష్టంపైనే కుటుంబ జీవనం సాగుతోంది. ప్రమాదంలో ఆయన మృతి చెందగా, మృతదేహం వద్ద భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అదనపు కట్నం వేధింపులకు వివాహిత బలి

- పోలీసులకు మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు



అర్చన(ఫైల్)

వర్ధన్నపేట: అదనపు కట్నం తీసుకురావాలని అత్తామామ వేధింపులకు గురి చేయడంతో తమ కూతురు ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని, ఈ ఘటనలో అత్తామామ, భర్తపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సూర్య ప్రకాష్ కథనం ప్రకారం మండలంలోని ఇల్లందకు చెందిన బేతివిజయ, వెంకటేశ్వర్లు దంపతులకు కుమారుడు, కూతురు అర్చన(28) ఉన్నారు. అర్చనను గత సంవత్సరం వరంగల్‌లోని కొత్తవాడకు చెందిన కందగట్ల సందీప్‌కు ఇచ్చి వివాహం చేశారు. సందీప్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అర్చనను కాపురానికి తీసుకెళ్లాడు. నెల పాటు బాగానే కాపురం చేశాడు. అనంతరం అదనపు కట్నం తీసుకురావాలని అత్తామామ, పెద్దమ్మ, భర్త వేధింపులకు గురి చేసేవారు. దీనికి తోడు భోజనం పెట్టకుండా వేధించేవారు. ఈ విషయం ఫోన్ ద్వారా అర్చన తన తల్లిదండ్రులకు తెలిపి ఏడ్చేది. ఈ క్రమంలో ఈ నెల 24న సందీప్, అర్చన అగ్రంపహాడ్ జాతరకు వచ్చారు. జాతర నుంచి ఇంటికి వెళ్లగా అత్తామామ, భర్త అర్చనను వేధించడం మొదలు పెట్టారు. ఈ నెల 25న రాత్రి సందీప్.. అర్చన తల్లిదండ్రులకు ఫోన్ చేసి అదనపు కట్నం ఇవ్వాలని, లేనిపక్షంలో తీసుకెళ్లాలన్నాడు. దీంతో తల్లిదండ్రులు ఈ నెల 26 తమ కూతురును ఇంటికి తీసుకువచ్చారు. అదే రోజు సాయంత్రం అర్చన ఆరోగ్యం క్షీణించి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించగా అర్చన అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి విజయ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

- పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో ఘటన
- మృతుడిది యాదాద్రి భువనగిరి జిల్లా



ప్రమాదానికి కారణమైన కారు

జనగామ: రోడ్డు ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై సృజన్ కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన రైతు ఉప్పు నర్సింగరావు(40) పెంబర్తి వద్ద తనకున్న పొలంలో పనులు ముగించుకుని బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు.. బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ నుంచి ఎగిరిపడిన నర్సింగరావు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు.

దొంగలకు కౌన్సెలింగ్



దొంగలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

ఏటూరునాగారం : మేడారం జాతరలో చోరీలు చేస్తూ పట్టుబడిన వారితోపాటు మరికొందరు అనుమానితులకు ఏటూరునాగారం ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగి మహాజాతరలో భక్తుల నుంచి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను చోరీ చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఏటూరునాగారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అప్పటి నుంచి జాతర ముగిసే వరకు వీరిని పీఎస్‌లోనే ఉంచారు. ఈ క్రమంలో మంగళవారం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 56 మంది దొంగలు, అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే, ఇందులో కొంతమందిపై కేసులు నమోదు చేసి వారి సొంత మండలాలకు పంపించారు. కాగా, వీరిని అరెస్టు చేయడం వల్ల జాతరలో కొంత మేర చోరీలు తగ్గినట్లు తెలుస్తోంది.